క్లుప్తంగా

తహసీల్దార్‌గా గణపతిరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్/ శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం తహసీల్దారుగా శిర్ల గణపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి జిల్లాలో పనిచేశారు. జిల్లాలో ఆమదాలవలస, పొందూరు తహసీల్దారు గాను, టెక్కలి ఎన్‌ఫోర్సుమెంటు డీటీ, సీఎస్‌డీటీ తదితర కేడర్‌లో పనిచేశారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో విద్యార్థులకు అందుబాటులో శుద్ధి జలాలు ఉంచినట్లు వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని తెలిపారు. వర్సిటీలోని వసతి గృహాల్లో బుధవారం ఆర్వో ప్లాంట్లను బుధవారం ప్రారంభించారు. వసతి గృహాలు, అకడమిక్ బ్లాక్‌ల్లో తాగునీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. వసతిగృహంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధికారులు నిరంతరం వసతిగృహాలను పర్యవేక్షించాలని సూచించారు. రెక్టార్ అడ్డయ్య, చీఫ్ వార్డెన్ ఎన్.లోకేశ్వరి, అసిస్టెంట్ చీఫ్ వార్డెన్ సి.హెచ్.రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

చేసిన సేవలుతోనే గుర్తింపు


ఉమామహేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ప్రజలకు అందించిన సేవలే ఉద్యోగికి గుర్తింపుని స్తాయని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన అదనపు ఎస్పీ (క్రైమ్) వి.ఉమామహేశ్వరరావును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఆరోగ్యం సహకరించనప్పటికీ జిల్లాలో ఎన్నికల సమయంలో అంకితభావంతో మహేశ్వరరెడ్డి విధులు నిర్వర్తించడం గొప్ప విషయమని కొనియాడారు. అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, డి.గంగాధరం, డీఎస్పీలు త్రినాథరావు, శృతి, బాలచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, శేషాద్రి ఉన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం ఆషాఢ బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం ఘనంగా జరిగింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమూర్తులుగా అనివేటి మండపంలో ఉంచి ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణం నిర్వహించారు.

2న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం బలగ ఆస్పత్రి జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ శిక్షణ సంస్థలో ఈనెల రెండో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ బుధవారం తెలిపారు. అపోలో ఫార్మసిస్ లిమిటెడ్ సంస్థ, యోకోమా సంస్థ, హెట్రో లాబ్స్ లిమిటెడ్ సంస్థల్లో వివిధ పోస్టుల భర్తీ కోసం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన స్త్రీ/పురుషులు అర్హులన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరు కావాలన్నారు. అపోలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో, యోకోమా కోసం విశాఖపట్నంలో, హెట్రో లాబ్స్ కోసం నక్కపల్లిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆకర్షణీయమైన జీతంతోపాటు ఇతర అలవెన్సులు వర్తిస్తాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఆ రోజు ఉదయం పది గంటలకు హాజరు కావాలని సూచించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి తక్షణ సాయం అందజేత

శ్రీకాకుళం క్రైమ్: అనారోగ్యంతో మృతిచెందిన శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.మాధవరావు కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద రూ. ఒక లక్ష చెక్కును జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. నగరంలోని మండలవీధిలో ఉన్న వారి స్వగృహంలో మాధవరావు మృతదేహానికి అసోసియేషన్ సభ్యులు బుధవారం నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మాధవరావు తల్లి హేమావతికి చెక్కును అందజేశారు.

పోలీసులకు సత్కారం..


ఉద్యోగ విరమణ చేసిన అధికారులతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

తీవ్ర మానసిక ఒత్తిడితో, కుటుంబానికి దూరంగా ఉంటూ సుదీర్ఘ కాలం పోలీసులుగా సేవలందించడం గొప్ప విషయమని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐలు ఏఎస్‌వీ వెంకటరావు, ఎం.కోటేశ్వరరావు, పి.శ్యామలరావు, కె.రమేష్‌బాబు, ఏఎస్ఐ ఎస్.ఆనందరావు, క్లాస్–4 ఉద్యోగి టి.సూర్యనారాయణలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ పాల్గొన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

యువకుల ఔదార్యం


నిస్సహాయులకు ఆహార పొట్లాలు అందిస్తున్న యువత

రాత్రి వేళ ఆకలితో బాధపడుతున్న నిస్సాహాయకులకు కొంతమంది యువకులు అండగా నిలిచారు. తమ ఉద్యోగ బాధ్యతలు పూర్తయిన తరువాత ద్విచక్ర వాహనాలపై వచ్చి నిరుపేదలకు అన్నం పొట్లాలను అందిస్తున్నారు. శ్రీకాకుళంలోని పాతబస్టాండు, పాతబ్రిడ్జి, ఏడు రోడ్ల కూడలి, కొత్తబ్రిడ్జి, డే అండ్ నైట్ కూడలి, కొత్త రోడ్, ఆర్టీసీ కాంప్లెక్సు తదితర ప్రాంతాలలో సుమారు ఏభై మందికి పైగా పేదలకు ఆహారాన్ని మంగళవారం రాత్రి అందజేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ఉర్లం శివతేజ, జాడ సాయి, అల్లాడ నవీన్, సుప్రజ రౌత్, పైడి ప్రదీప్, పడుగు చరణ్, నంది ఉమాశంకర్, గిరజాల మహాలక్ష్మి ఉన్నారు. విందులు, వినోదాల సమయంలో ఆహారం మిగిలిపోతే 87909 44902 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

అయ్యప్ప స్వామికి పూజలు


బలగలో అయ్యప్పకు పూజలు

శ్రీకాకుళంలోని బలగ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు ఉన్నారు. అలాగే పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలోని అయ్యప్పస్వామికి కూడా పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు ఉన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

తల్లిపాలు అమృతంతో సమానం


శ్రీకాకుళం అర్బన్: శిశువులకు తల్లిపాల కంటే శ్రేష్ఠమైనవి సృష్టిలో ఏవీ లేవు. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివి. అన్ని రకాల పోషకాలు అందించి రోగాల నుంచి రక్షించే ఔషధం. తల్లిపాలతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిలో పోషకాలు, వాటి విశిష్టతను ప్రతిఒక్కరికీ తెలియజేసేలా ఏటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వారం రోజులు అవగాహన

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. తల్లి పాలు బిడ్డలకు ఎంత మంచిదో తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ముర్రుపాల ఆవశ్యకత

బిడ్డ పుట్టిన తర్వాత అరగంటలోపు తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. ఇవి శిశువుకు కచ్చితంగా పట్టాలి. దీనివలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా సమతుల ఆహారం అందుతుంది. ఈ పాలలో మాంసాకృత్తులు, విటమిన్–ఏ ఉంటుంది. బిడ్డకు వ్యాధులు రాకుండా జీవిత కాలం కాపాడుతాయి. శిశువు ప్రేగులను శుభ్రం చేసి మొదటి మల, మూత్ర విసర్జనకు తోడ్పడతాయి. ఆరునెలల వరకూ బిడ్డకు తప్పనిసరిగా రోజూ మూడు నుంచి పదిసార్లు పాలు ఇవ్వాలి.



• నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరం



తల్లిపాలు బిడ్డకు ఎంతో అవసరం. దీనిపై ప్రతి అంగన్‌వాడీ కేంద్రప రిధిలోని గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా వారం రోజులు అవగాహన కల్పిస్తాం.

– బి.శాంతిశ్రీ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

ముర్రుపాలు కచ్చితంగా పట్టాలి



బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలి. ఎందుకంటే బిడ్డ పుట్టిన పది నిముషాల్లో ముర్రుపాలు విడుదలవుతాయి. అవి బిడ్డకు పట్టిస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవు. ముర్రుపాలపై తల్లుల్లో మరింత అవగాహన అవసరం. – బి.మీనాక్షి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి

గణపతిరావు సేవలు అభినందనీయం


గణపతిరావును సత్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

• కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వహించడంలో జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేసిన మొల్లేటి గణపతిరావు ముందువరుసలో ఉంటారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెవెన్యూ అసోసియేషన్, జిల్లా అధికారుల సంఘం బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిరావును దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలకమైనదన్నారు. అలాంటి శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగంలో చేరి వివిధ దశల్లో కీలకమైన బాధ్యతలను గణపతిరావు నిర్వహించారు. ఈయన సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు సాధించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో 30 ఏళ్ల అనుభవం గడించిన గణపతిరావు లాంటి వ్యక్తులు ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఏదో ఒక రూపంలో ప్రజా సేవ చేయాలని కోరారు. గణపతిరావు మాట్లాడుతూ.. ఉద్యోగంలోనే సంతోషం వెతుక్కోవడాన్ని ఆస్వాదిస్తానన్నారు. గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం, అలాగే తనకి ఎంతో ఇష్టమైన రచనల ద్వారా కొన్ని పుస్తకాలను ముద్రించడం సంతృప్తి నిచ్చాయన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎన్నికల నిర్వహణలో ఎన్నో అనుభవాలు గడించానని గుర్తు చేసుకున్నారు.


సత్కారం పొందుతున్న రాజమోహనరావు

తహసీల్దార్‌కు..

తహసీల్దార్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన బలివాడ రాజమోహనరావు కూడా ఈ సందర్భంగా కలెక్టర్, జేసీలు సత్కరించారు. కార్యక్రమంలో పలాస, శ్రీకాకుళం ఆర్డీవోలు భరత్ నాయక్, సీహెచ్ రంగయ్య, సీపీఓ ప్రసన్నలక్ష్మి, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాలు అందజేత


పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలు కష్టబడి కాకుండా ఇష్టబడి చదవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, అన్నపూర్ణారావు, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

రణస్థలం: క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు బుధవారం పంపిణీ చేశారు. ఇంటర్‌లో ఒకేసారి 60 శాతం మార్కులతో పాసైతే స్థానిక ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 85పై పునరాలోచన చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

రణస్థలం: ప్రభుత్వ వైద్యులు పీజీ ప్రవేశంలో ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీఓ నంబర్ 85పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పీజీ ప్రవేశంలో పీహెచ్‌సీ వైద్యులకు 30 శాతం ఉన్న ఇన్ సర్వీస్ రిజర్వేషన్‌ను 15 శాతానికి తగ్గిస్తూ జీఓ జారీ చేశారని, దీంతో తాము చాలా నష్టపోతమన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులను మినహాయించాలని కోరారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యులు కృష్ణచైతన్య, జనార్దన్, యమున, గంగా ప్రియదర్శిని, ఉష, ప్రతిష్ట శర్మ, మౌనిక, మణిభూషణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మున్షి ప్రేమ్‌చంద్ సేవలు మరువలేనివి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రముఖ సాహిత్యకార్ మున్షి ప్రేమ్‌చంద్ సమాజంలో లోటుపాట్లు, స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టేలా చేసిన సాహితీ ప్రేరణలు వెలకట్టలేనివని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. కళాశాలలో హిందీ అధ్యాపకులు పి.పార్వతి ఆధ్వర్యంలో ప్రేమ్‌చంద్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను, మూఢనమ్మకాలను నిరసిస్తూ ప్రేమ్‌చంద్ అనేక రచనలు చేశారని వక్తలు గుర్తు చేశారు. హిందీ, ఉర్దూ సామాజిక కల్పనకు ఆయన మార్గదర్శకుడన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి ఉన్నారు.

ఇంజినీరింగ్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 వరకు పరీక్షలు జరగనున్నాయి. 325 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్ భాస్కర్, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖర్‌రావు పర్యవేక్షిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామంలో స్థానిక వైద్యాధికారి పేకల సుమబింధు, సర్పంచ్ కామొజుల ఆరుద్ర ఆధ్వర్యంలో బుధవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందుస్తుగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, నాయకులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవామృతాలతో పోషకాలు

ఎచ్చెర్ల: నేలలో పోషకాలు అభివృద్ధి చెందడం కోసం పీఎండీఎస్, ఘన, ద్రవ జీవామృతాలు వాడుకోవాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి చంద్రకళ తెలిపారు. కేశవరావుపేట గ్రామంలో ఘన జీవామృతం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. జీవామృతాలను వాడటం వల్ల భూమిలోని పోషకాలు అభివృద్ధి చెంది, పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీఓ ఆర్.రమా దేవి బుధవారం తెలిపారు. మండలంలోని 28 గ్రామ సచివాలయాల పరిధిలో అన్నిరకాల సమాజిక పింఛన్లు 12,572 ఉండగా.. రూ.5.08 కోట్లు పంపిణీకి సిద్ధం చేశామన్నారు.

ఢిల్లీ ధర్నాలో జిల్లా నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కరెన్సీనోటుపై అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కంఠ వేణు కోరారు. ఈమేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సంఘ జాతీయ అధ్యక్షులు జెరిపోతుల పరశురాం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మహాధర్నాలో ఆయనతోపాటు జిల్లాకు చెందిన సమితి ప్రతినిధులు ఉదయ్‌భాస్కర్, ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల రేపు

అరసవల్లి: నగర పాలక సంస్థ పరిధిలోని పీఎన్ కాలనీ, అరసవల్లి విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఈ నెల రెండో తేదీన మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని పెద్ద రెల్లివీధి, సెయింట్ జోసఫ్ కాన్వెంట్ ఏరియా, కెల్లవీధి, టీటీడీ రోడ్డు, 80 ఫీట్ రోడ్డు, అరసవల్లి మిల్లు జంక్షన్, ఎల్.బి.ఎస్.కాలనీ, ఉమెన్స్ కళాశాల రోడ్డు, జేసీ బంగ్లా ఏరియా, కిమ్స్ ఏరియా, పీఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రణస్థలం: ఈ నెల 2న మండలంలోని రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటన తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరప్పాలెం, బండిపాలెం, ముక్తంపురం, పున్నానపాలెం, సంచాం, బంటుపల్లి, కంబాలపేట, తిరుపతిపాలెం, పాతర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మరువాడ, దేరసాం, ఉప్పివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

వీఆర్వోపై దాడి అమానుషం


రిమ్స్‌లో వీఆర్వో లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న శ్రీరామమూర్తి

శ్రీకాకుళం: బూర్జ మండలం ఓ.వి.పేట వీర్వోగా పనిచేస్తున్న వేపారి లక్ష్మీనారాయణపై దాడి చేయడం అమానుషమని కళింగ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో లక్ష్మీనారాయణను పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బూర్జ ఎస్ఐ, డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో సామాజిక కార్యకర్త బి.వి.ఎస్.ఎన్.రాజు ఉన్నారు.

కొమ్మలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొత్తబ్రిడ్జి రోడ్డులో ఇంటాక్ ఏర్పాటు చేసిన తేజోమూర్తుల విగ్రహాలను ఎవరూ పట్టించుకోవడం మానేశారు. దీనిపై 'తేజోమూర్తులను పట్టించుకోరా?' శీర్షికతో బుధవారం 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి సంబంధిత అధికారులు స్పందించారు. కోడిరామ్మూర్తి విగ్రహం వద్ద ఉన్న చెట్టుకొమ్మలను తొలగించారు. దీంతో ఆ విగ్రహం అందరికీ సుందరంగా కనిపిస్తుంది. వెంటనే అధికారులు స్పందించినందుకు ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన నాయకుల విగ్రహాలను కూడా శుభ్రం చేయించాలని అభిమానులు కోరుతున్నారు.


కొమ్మలు తొలగించిన తరువాత కోడిరామ్మూర్తి విగ్రహం